క్లుప్తంగా

మ్యాన్‌హోల్ లీకుతో దుర్వాసన



మధురానగర్‌లో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్‌లో అమృత ఎన్‌క్లేవ్ వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. పది రోజులుగా మురుగునీరు రోడ్డుపై నుంచి ప్రవహించడంతో దుర్వాసనతో స్థానికులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

26న మృత్యుంజయ పాశుపత హోమం

సీతంపేట : మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 26న ఉదయం 9:30 గంటలకు అఘోర మృత్యుంజయ పాశుపత హోమం, రాత్రి 8:30 గంటలకు కాళీ కాలభైరవులకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అమావాస్య సందర్భంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రత్యంగిర భద్రకాళి హోమం నిర్వహిస్తామని, పాల్గొనదలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30 గంటలకు బాలభోగం నివేదిస్తారు. అనంతరం భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, సామూహిక విష్ణు సహస్రనామార్చన, రాజభోగ నివేదన చేస్తారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం విశేష హారతి సమర్పిస్తారు.

కప్పరాడ యూపీహెచ్‌సీ తనిఖీ



కప్పరాడ యూపీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : కంచరపాలెం జాతీయ రహదారిలో కప్పరాడ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో పలు ప్రాంతాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఓపీ, ఐపీ సేవలు, డయాగ్నోస్టిక్ సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అభ ఐడీ నూరు శాతం అమలయ్యేలా చూడాలన్నారు. నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల లార్వా పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయనతోపాటు నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, ఇతర పట్టణ వైద్య అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ శిబిరం

ఎంవీపీకాలనీ: ఎస్ యోగా, శివాజీ పార్క్ గొడుగు వాకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ నెల 17 నుంచి యోగా గురువు రాజగోపాల్ పర్యవేక్షణలో శిక్షకుడు శివలక్ష్మణ్ 50 మందికి శివాజీ పార్క్‌లో ఉచిత యోగా శిక్షణ అందించారు. వివిధ ప్రాణాయామ పద్ధతులు, సూర్య నమస్కారాలు తదితర ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. యోగా ద్వారా ఆరోగ్యానికి జరిగే మేలును వివరించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల సేవలను శిక్షణ పొందిన వారు అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కె.శివరామకృష్ణ, ఎస్.రామకృష్ణ, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ పాలనలో ఇలా : ఆధునికంగా నిర్మించి ప్రారంభించిన బస్ షెల్టర్



కూటమి పాలనలో ఇలా...: రూపురేఖలు మారిపోయిన పోర్టు హాస్పిటల్ బస్ షెల్టర్

కళావిహీనం



తాటిచెట్లపాలెం :

నగరంలోని బస్టాప్‌లు అధ్వానంగా తయారవడంతో ప్రయాణికులు నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్టాప్‌లు పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్లే కళావిహీనంగా మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పలు ముఖ్య ప్రాంతాల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా అత్యాధునిక హంగులతో బస్ షెల్టర్లను నిర్మించారు. తదనంతరం ప్రభుత్వం మారడంతో వాటి నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై నిర్మించిన పోర్టు హాస్పిటల్ నార్త్, అక్కయ్యపాలెం నార్త్ బస్ షెల్టర్లు నిరాదరణకు గురై, నిర్వహణ లేమితో శిథిలావస్థకు చేరుకున్నాయి. లక్షల రూపాయలతో అత్యాధునిక హంగులతో నిర్మించిన ఈ షెల్టర్లు పూర్తిగా నిరాదరణకు గురయ్యాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన సీలింగ్ లైట్లు మాయం కాగా వాటికి సంబంధించిన వైర్లు గాలిలో వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ముందు భాగంలో గల బోర్డుకు సంబంధించిన లైటింగ్ వ్యవస్థ కూడా పూర్తిగా మాయమైంది. ఇక్కడ ఉండాల్సిన లైట్లు స్థానంలో కేవలం వైర్లు మాత్రమే గాల్లో వేలాడుతున్నాయి. ఇంకా మెయిన్ బోర్డు, స్విచ్‌బోర్డుల వద్ద కూడా రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. పొరపాటున పిల్లలు వైర్లు తాకితే కరెంటు షాక్ కొట్టాల్సిందే. షెల్టర్ పైన ఏర్పాటు చేసిన బోర్డు కూడా ప్రమాదకరంగా మారి, ఎప్పుడైనా గట్టిగా గాలేస్తే రేకులు ఎగిరి మనుషుల మీద పడేలా ఉన్నాయి. కొన్ని చోట్ల బస్ షెల్టర్‌లు బాగున్నా, మరికొన్నింటిని మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. మిగిలిన షెల్టర్ల మాదిరి దీనిని కూడా బాగు చేయాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

రైల్వేస్టేషన్ వద్ద కూడా...

విశాఖపట్నం రైల్వేస్టేషన్ వద్ద కూడా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బస్ షెల్టర్‌ను గాలికొదిలేశారు. ఈ షెల్టర్‌లో లైట్లు సరిగా లేవు. ఫ్యాన్లు బిగించారో లేదో తెలియదు. వైర్లు మాత్రం గాల్లో వేలాడుతున్నాయి. బస్ షెల్టర్ పేరును తెలియజేసే నేమ్ బోర్డు కూడా అసంపూర్తిగా వెలుగుతోంది. జీవీఎంసీ అధికారులు వీటిని పూర్తిగా గాలికొదిలేశారు. ఇక్కడ ఉన్న వస్తువులు మాయమైనా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రమాదకరంగా ఉన్నా కనీస చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్లలో అవసరమైన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.



సగం లైట్స్ మాత్రమే వెలుగుతున్న రైల్వేస్టేషన్ బస్ షెల్టర్



చీకట్లో పోర్టు హాస్పిటల్ సౌత్ (ముస్లిం తాటిచెట్లపాలెం) బస్‌షెల్టర్



అక్కయ్యపాలెం హైవే నార్త్ బస్ షెల్టర్ వద్ద వెలగని టవర్ లైట్స్

కొత్త వెంకోజీపాలెంలో స్థలం పరిశీలన



కొత్త వెంకోజీపాలెంలో స్థలం పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్, తదితరులు

సీతమ్మధార: జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ జ్ఞానానంద ఆశ్రమం దరి శ్మశానవాటిక స్థలాన్ని తహసీల్దార్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో సర్వే చేశారు. ఈ స్థలం తనదేనంటూ ఇక్కడి పూర్ణానంద స్వామి అలియాస్ పున్నయ్య స్వామి వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఈ భూములను శుక్రవారం పరిశీలించారు. ఇది రెవెన్యూ రికార్డు ప్రకారం కొండపోరంబోకు కిందకు వస్తుందని తహసీల్దార్ స్పష్టం చేశారు. ఆయన వెంట వీఆర్వోలు ఖాదర్, అనురాధ, సర్వేయర్లు పైడిరాజు, సత్యనారాయణ ఉన్నారు. భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్ మద్దిలపాలెం, రేసపువానిపాలెంలోని యూఎల్‌సీ భూములను శుక్రవారం పరిశీలించారు.

శ్రీరామ పట్టాభిషేకం రేపు

మురళీనగర్ : మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు వేములపల్లి కళాక్షేత్రంలో శ్రీరామ పట్టాభిషేకం ఉత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు పార్కు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వరప్రసాద్, పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. విశాఖ, విజయవాడ, హైదరాబాద్ తవాస్మి దాస బృందం, శ్రీరామ సేవా సమితి సంయుక్తంగా ఆ రోజు ఉదయం 8.30 గంటల నుంచి 12 వరకు ఉత్సవం నిర్వహిస్తారన్నారు. ముఖ్య సంచాలకుడు డాక్టర్ జీఆర్‌కే ప్రసాద్ పర్యవేక్షణలో శ్రీరాముడికి అష్టోత్తర నామావళి పూజ, సీతమ్మవారికి కుంకుమ పూజ, ఆంజనేయస్వామికి 108 తమలపాకుల పూజ నిర్వహిస్తామని తెలిపారు.

నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న క్రైం సీఐ శ్రీనివాసరావు

మర్రిపాలెం : ఇటీవల కాలంలో జరుగుతున్న నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కంచరపాలెం క్రైం సీఐ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఊర్వశి వద్ద ఉన్న నవర ఐటీఐ కాలేజీలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేరాలు ఎలా జరుగుతున్నాయో, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కంచరపాలెం పరిధిలో బైక్‌లు, సెల్‌ఫోన్ల దొంగతనాలు, ఇళ్లలో చోరీలు, సైబర్ నేరాలపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బైక్‌లు సురక్షిత ప్రదేశాల్లో పార్కు చేసి తాళాలు వేయాలన్నారు. అలాగే తాళం వేసి ఉన్న ఇళ్లలో కూడా చోరీలు జరుగుతున్నాయని తెలిపారు. ఇంటికి తాళం వేసి వెళ్లే వారు తెలిసిన వారికి, లేదా పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. నిర్లక్ష్యం, అవగాహనా లోపం వల్లే ఇటువంటివి జరుగుతున్నాయని చెప్పారు. అపార్టుమెంట్లలో నివసించేవారు సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌కు అపరిచిత వ్యక్తుల నుంచి మెసేజ్‌లు వచ్చినా ఆ లింకులు ఓపెన్ చేయకూడదని, వాటికి స్పందించకూడదని సూచించారు. అలాగే ఆన్‌లైన్ మోసాలు, బంగారం, వెండి చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. యువత ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండాలని, వాటి జోలికి పోకూడదని, అఘాయిత్యాలకు పాల్పడకుండా చక్కగా చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించకుండా హెల్మెట్ ధరించి నిబంధనలు పాటించాలని సూచించారు.

9 కేజీల గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి 9 కేజీల గంజాయి సీజ్ చేశారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతాదళం పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్‌పీ ఎస్ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తమిళనాడు రాష్ట్రం రామనాథపురం జిల్లాకు చెందిన కె.సూర్యప్రకాష్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు నిర్ధారించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని 9 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

ఎరుకుమాంబ ఆలయంలో 26న శివరాత్రి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ ఆలయంలో ఈనెల 26వ తేదీన మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో జీవీ రమాబాయి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ బుధవారం శివరాత్రి పండగ నేపథ్యంలో అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారని తెలిపారు. ఆ రోజు అమ్మవారికి పసుపు నీళ్ల అభిషేకం ఉండవని, భక్తులు గమనించాలని తెలిపారు. మార్చి 5వ తేదీ బుధవారం నుండి అమ్మవారికి యథావిధిగా పసుపు నీళ్ల అభిషేకాలు ఉంటాయని పేర్కొన్నారు. శివరాత్రి ఉదయం 6 నుండి సాయంత్రం 6 వరకు అమ్మవారికి కుంకుమ పూజలు, దర్శనాలు ఉంటాయన్నారు. సాయంత్రం 4 నుండి రాత్రి 10 వరకు పురవీధుల్లో సాంస్కృతిక, నృత్య, వినోద కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మార్చి 6 గురువారం మారువారం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుండి మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు మీదే వాహనాల పార్కింగ్



సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ మెయిన్ రోడ్డు మీదనే పార్కింగ్ చేసిన వాహనాలు

- నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని ద్వారకా ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధిలో గల సీతమ్మధార దరి నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో ట్రాఫిక్ కష్టాలు తీరకపోగా రోజూ రెట్టింపు అవుతున్నాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక్కడ ఒకవైపు బాలయ్యశాస్త్రి లే అవుట్ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు పడుతుండగా, ఎదురుగా ఉన్న సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుటనే వాహనాల పార్కింగ్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడి దుకాణాల ఎదురుగానే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ మార్గంలో గల బ్యాంకులకు వచ్చే వినియోగదారులు కూడా ఇక్కడే వాహనాలు పార్కింగ్ చేయడం గమనార్హం. ఇక్కడి మెయిన్ రోడ్డులో గల వాణిజ్య సముదాయాలు, కల్యాణ మండపాలకు వచ్చే వినియోగదారులు, ప్రజలు తమ వాహనాలను సెల్లార్‌కి బదులుగా రోడ్డు మీదనే పార్కింగ్ చేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఈ మార్గంలో ఎక్కడా ట్రాఫిక్ కానిస్టేబుల్ బీట్ సైతం లేదు. దీంతో వాహనచోదకుల పార్కింగ్‌కి అడ్డు అదుపూ లేకుండా పోతోందని స్థానిక ప్రజలు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో పోర్టు స్టేడియం, బాలయ్యశాస్త్రి లే అవుట్, అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రాంతాలకు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే టీపీటీ కాలనీ, సీతమ్మధార, హెచ్‌బీ కాలనీ ప్రాంత వాసులు కూడా రాకపోకలు సాగిస్తారు. తహసీల్దార్ కార్యాలయం, ఎన్ఆర్ఐ ఆస్పత్రి, ఈపీడీసీఎల్ కార్యాలయం, యూనియన్ బ్యాంకు, ఇతర దుకాణాలకు రాకపోకలు సాగించే ప్రజలు ఈ మార్గం ద్వారానే ప్రయాణాలు సాగిస్తారు. ఇంత రద్దీగా ఉండే మార్గంలో నార్త్ ఎక్స్‌టెన్షన్ మెయిన్ రోడ్డు మీదనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నా ద్వారకా ట్రాఫిక్ పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ద్వారకా పోలీసులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


టీబీపై అవగాహన ర్యాలీ



బాపూజీనగర్‌లో ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ నాయుడు

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు ఊర్వశి కూడలి పరిధి బాపూజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో జిల్లా క్షయ నివారణ సంస్థ ఆధ్వర్యంలో టీబీ వారోత్సవాలు, గర్భస్థ శిశు లింగ నిర్ధారణపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని డాక్టర్ నాయుడు తెలిపారు. సమాజంలో ఆడ, మగ బేధం ఉండకూడదని తెలిపారు. ఇందిరానగర్, బాపూజీనగర్, శ్రీనివాసనగర్, జై భారత్ నగర్ తదితర ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ప్లకార్డులతో ర్యాలీ చేశారు. హెచ్ఎస్ఈ సూర్యానారాయణ, ఎస్‌టీఎల్ఎస్ శరత్‌బాబు, టీబీహెచ్‌వీ నూనెల పైడిరాజు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి



సీతమ్మధార యూనియన్ బ్యాంక్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సీతమ్మధార : యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మార్చి 24, 25న దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చామని యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఆర్.వసంతరావు తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సీతమ్మధార బ్రాంచి వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని బ్యాంకుల బ్రాంచిలలో ఖాళీగా ఉన్న ఉద్యోగ నియామకాలను చేపట్టాలని, వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు పరచాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వరంగ బ్యాంకులలో వర్క్ మెన్, ఆఫీసర్స్ డైరెక్టర్ల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మహీంద్ర, ఆదారి శ్రీను, రమేష్, ఈశ్వర్, శ్రీనివాస్, అనిల్, సుజాత, ప్రత్యూష పాల్గొన్నారు.

కుంగిన రహదారులు



దుర్గా గణపతి ఆలయం వెనుక రోడ్‌లో ఏర్పడిన గొయ్యి



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ సమీపంలో రహదారి దుస్థితి

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట, మధురానగర్ ప్రాంతాల్లో రహదారులు కుంగిపోయి గోతులు ఏర్పడ్డాయి. దుర్గా గణపతి ఆలయం వెనుక రోడ్‌లో రహదారి కిందకు కుంగడంతో పెద్ద గొయ్యి ఏర్పడింది. అలాగే మధురానగర్ జీవీఎంసీ స్కూల్ సమీపంలో ఇటీవల యూజీడీ పైప్‌లైన్ మరమ్మతుల కోసం రహదారిని తవ్వారు. పనులు పూర్తయ్యాక రహదారిని కాంక్రీట్‌తో పూడ్చారు. పూడ్చిన కొద్ది రోజులకే రహదారి కుంగిపోవడంతో గోతులు ఏర్పడ్డాయి. ప్రధాన రహదారుల్లో గోతులు ఏర్పడడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్లపల్లి - దానాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి–దానాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. చర్లపల్లి–దానాపూర్(07749) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ శనివారం ఉదయం 9.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి అదే రోజు రాత్రి 10.55 గంటలకు విజయనగరం చేరుకుంటుంది. అక్కడ నుంచి 11 గంటలకు బయలుదేరి సోమవారం తెల్లవారు 2 గంటలకు దానాపూర్ వెళ్తుంది. దానాపూర్–చర్లపల్లి (07750) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ దానాపూర్‌లో శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.15 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

చర్లపల్లి–దానాపూర్(07751) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మంగళవారం తెల్లవారు 2 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. దానాపూర్–చర్లపల్లి (07752) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ దానాపూర్‌లో ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.15 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైళ్లకు కొత్తవలసలో హాల్ట్ ఉందని డీసీఎం తెలిపారు.

రైతుబజార్‌లో విక్రయాలకు అందరికీ అవకాశం



సీతమ్మధార రైతుబజారులో పరిశీలిస్తున్న పాపారావు

సీతమ్మధార : రైతుబజార్‌లో పంటలు విక్రయించుకునేందుకు ప్రభుత్వం బయటి రైతులకు కూడా అవకాశం కల్పించిందని విశాఖ జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి పి.పాపారావు వెల్లడించారు. ఆయన సీతమ్మధార రైతుబజార్‌ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సొంతంగా పండించిన పంటలతోపాటు మిగతా రైతులు టమాటా పండిస్తే వారికి గిట్టుబాటు ధర రావడానికి ఆ సరకునూ రైతుబజార్ లో విక్రయించాలని సూచించారు.

జిల్లాలో అధికంగా పంటలు పండిస్తూ గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడే రైతులు ఎవరైనా ఉంటే మా దృష్టికి తీసుకురావాలని కోరారు. స్థానిక పంటలు సరిపడా వస్తున్నప్పుడు హోల్‌సేల్ మార్కెట్ నుంచి కొని ఎవరూ తీసుకురాకూడదని స్పష్టం చేశారు. రైతుబజార్‌లో కూరగాయల కొరత లేకుండా చూడాలని, రైతులకు అండగా ఉన్నామనే భరోసా కలిగించాలని ప్రభుత్వం బయటి రైతులకు కూడా విక్రయాలకు అవకాశం కల్పించిందని వివరించారు. రైతులకు నష్టం రాకుండా రైతుబజార్‌లో సరైన ధరలు నిర్ణయించాలని ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తికి ఆదేశించారు.